క్లుప్తంగా

మహిళలకు కుట్టు మిషన్ల అందజేత


కార్యక్రమంలో పాల్గొన్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: నిరుపేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తమ సంస్థ సహాయం అందిస్తోందని కోరమాండల్ సంస్థ యూనిట్ హెడ్ జ్ఞానసుందరం తెలిపారు. కోరమాండల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో పలువురు నిరుపేద మహిళలకు జ్యూట్ మిషన్లు, కుట్టు మిషన్లు, జిగ్‌జాగ్ మిషన్లు అందజేసింది. ఆదివారం కోరమాండల్ సంస్థ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాస్‌రావు, డిప్యూటీ మేనేజర్, వాసవ్య మహిళా మండల్ ప్రతినిధి మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను మరవద్దు


కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకుడు సత్యానంధం

మల్కాపురం: గాంధీజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను అర్థం చేసుకుని, వాటిని పిల్లలు స్ఫూర్తిగా తీసుకోవాలని కార్మిక సంఘ నాయకుడు బి. సత్యానందం అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో స్వాతంత్ర సమరయోధుల జీవిత విశేషాలను ఆయన చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంటమాంబ అమ్మవారి పరస


పెంటమాంబ అమ్మవారు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి పరస కార్యక్రమం సోమవారం జరగనుంది. ఈ నెల 15వ తేదీ నుంచి అమ్మవారి పండుగ మహోత్సవాలు ఇక్కడ గల మందిరం వద్ద జరుగుతున్నాయి. సోమవారం ప్రధాన పండుగ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పరస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు యాదవ్ ఆదివారం తెలిపారు.

సమ్మెకు మద్దతుగా నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీ


పెదగంట్యాడ జంక్షన్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న సీహెచ్ నర్సింగరావు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించే వరకు పోరాడతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం చేపట్టనున్న జాతీయ సమ్మెకు మద్దతుగా ఆదివారం పెదగంట్యాడలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్‌లో సీహెచ్ నర్సింగరావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఏకకాలంలో 2 వేల మంది కార్మికులను తొలగించడం దారుణమని అన్నారు.

ఎయిడ్స్ మృతులకు నివాళి

మహారాణిపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆదివారం ర్యాలీ, సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా రామాటాకీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ సాగింది.

సామాజిక బాధ్యతలో సవతి తల్లి ప్రేమ

- సీఎస్ఆర్ నిధులు ఆ ఒక్క వార్డుకేనా?
- మిగిలిన వార్డులు ఏ పాపం చేశాయి
- కోరమాండల్ సంస్థపై ఆయా వార్డు ప్రజల ఆగ్రహం


పిలకవానిపాలెం వద్ద రూ.30 లక్షలతో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన సామాజిక భవనం

మల్కాపురం: విశాఖ పారిశ్రామిక ప్రాంతంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ విడుదల చేసే కాలుష్యం చుట్టుపక్కల ఏడు వార్డుల ప్రజలకు నిత్యం ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతోంది. అయితే ఆ సంస్థ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను మాత్రం కేవలం ఒకే ఒక్క వార్డుకు పరిమితం చేస్తోంది. దీంతో మిగిలిన ఆరు వార్డుల కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వార్డులకు సైతం అభివృద్ధి పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

58వ వార్డు పరిధిలోని శ్రీహరిపురం సమీపంలో సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉన్న కోరమాండల్ ఎరువుల కర్మాగారం నుంచి నిత్యం అమ్మోనియా, సల్ఫర్ డయాక్సైడ్ వంటి విషపూరిత వాయువులు వెలువడుతుంటాయి. ఈ కాలుష్యం వల్ల పారిశ్రామిక ప్రాంత ప్రజలు నిత్యం అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీని నివారణకు సంస్థ మెడికల్ క్యాంపులు నిర్వహించడంతో పాటు, ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. స్థానికంగా నిరుద్యోగులకు కాంట్రాక్ట్ పద్ధతినైనా ఉపాధి కల్పించాలి. కాని కోరమాండల్ సంస్థ నాలుగేళ్లుగా తమ సీఎస్ఆర్ నిధులను కేవలం 58వ వార్డుకు మాత్రమే పరిమితం చేసింది. ఈ ఒక్క వార్డులో దాదాపు రూ. 2 కోట్లతో సామాజిక భవనాలు, ఆర్వో వాటర్ ప్లాంట్లు, మెడికల్ క్యాంపులు, మహిళలకు కుట్టు శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ, ఓపెన్


శ్రీరామ్‌నగర్‌లో రూ.4లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)


మహిళలకు టైలరింగ్ మిషన్, జిగ్‌జాగ్ మిషన్ అందజేస్తున్న అధికారులు (ఫైల్)

జిమ్‌లు వంటి పనులు చేపట్టింది. అదే సమయంలో 59వ వార్డులో కేవలం రూ. 2 లక్షలతో ఒక ఓపెన్ జిమ్, 60వ వార్డులో రూ. 30 లక్షలతో ఒక సామాజిక భవనం మాత్రమే నిర్మించింది. ఇక 61, 62, 63, 40 వార్డుల్లో అయితే చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులేమీ జరగలేదు. కనీసం ఒక్క మెడికల్ క్యాంప్ కూడా నిర్వహించకపోవడం, ఆ వార్డుల నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

వివక్ష ఎందుకు?

ఈ వివక్షపై మిగిలిన వార్డుల ప్రజలు, ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం అందరికీ సమస్య అయినప్పుడు, సీఎస్ఆర్ నిధులు కూడా అన్ని వార్డులకు సమానంగా అందాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కోరమాండల్ సంస్థ తమ విధానాన్ని మార్చుకుని, మిగిలిన వార్డుల అభివృద్ధికి కూడా సహకరించాలని వారు కోరుతున్నారు.

> **సంస్థ తీరు దారుణం**
>
> కోరమాండల్ సంస్థ నుంచి వెలువడే కాలుష్యాన్ని తమ వార్డు ప్రజలు పీలుస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆ సంస్థ తమ వార్డులో కనీసం ఒక్క మెడికల్ క్యాంప్ కూడా నిర్వహించలేదు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేదు. ఇది చాలా దారుణం. వీటిపై పోరాటం చేస్తాం.
>
> –పీవీ సురేష్, 60వ వార్డు కార్పొరేటర్

63వ వార్డులో పరిష్కారం కానీ తాగునీటి సమస్య


63వ వార్డు చింతల్లోవ గ్రామంలో మరో చోట దెబ్బతిన్న పైప్‌లైన్

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతల్లోవ, జయేంద్రకాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కారణంగా తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినడంతో వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. శనివారం ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో కార్పొరేటర్ గల్లా చిన్నా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అయితే ఆదివారం నీటి సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు చెప్పినప్పటికీ పైప్‌లైన్ మరోచోట కూడా దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆగ్రహించిన స్థానికులు సోమవారం నాటికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చురుగ్గా హైస్కూల్ గ్రౌండ్ పనులు


చదును చేస్తున్న హైస్కూల్ గ్రౌండ్


గ్రౌండ్‌లో ప్రమాదకరంగా ఉన్న కళాప్రాంగణం (ఫైల్)


గోపాలపట్నం: గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. క్రీడా ప్రాంగణాన్ని చదును చేస్తున్నారు. మైదానం మొత్తం ఒకే ఎత్తుకు వచ్చాక నీరు నిల్వకుండా ప్రత్యేకంగా చదును చేయనున్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. క్రికెట్ ఆడేవారి కోసం నెట్ ప్రాక్టీస్ కోసం ఒక బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదని అధికారులు తెలిపారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, రన్నింగ్ ట్రాక్ వంటి అనేక సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదకరంగా ఉన్న పాత కళా ప్రాంగణాన్ని అధికారులు తొలగించారు. తొలుత దానిని మరమ్మతులు చేయాలని భావించినప్పటికీ, అది పూర్తిగా పనికిరాకుండా ఉండటంతో తొలగించారు. దాని స్థానంలో కొత్తది నిర్మించాలా లేదా అలానే వదిలేయాలా అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గ్రౌండ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రాత్రిపూట కూడా పనులు చేస్తున్నారు.


సెల్ టవర్‌కు వ్యతిరేకంగా వినూత్న నిరసన


సెల్ టవర్ నమూనాతో నిరసన చేస్తున్న చెంగల్రావుపేట పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: జనావాసాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దంటూ 38వ వార్డు చెంగల్రావుపేటకు చెందిన పలువురు స్థానికులు చెంగల్రావుపేట పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వినూత్న నిరసన చేపట్టారు. టవర్ రేడియేషన్ వల్ల ఏర్పడే అనర్థాలపై నమూనాతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ సెల్ టవర్ ఏర్పాటు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అధిక రేడియేషన్ వల్ల పలు జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని, ఎనిమిదేళ్ల కిందట ఇదే ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తుంటే స్థానికులంతా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో టవర్ ఏర్పాటు అప్పట్లో నిలిపివేశారన్నారు. మళ్లీ ఇదే ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు ఎలా అనుమతులిచ్చారని ప్రశ్నించారు. టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో పిల్లలు చదువుకునే స్కూల్, గర్భిణులకు ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రి ఉన్నాయన్నారు. సెల్ టవర్ రేడియేషన్ ప్రభావంతో పిల్లలు, పెద్దలు, గర్భిణులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అనేక నివేదికలు చెబుతున్నా.. ఈ ప్రాంతంలో ఏర్పాటుకు ఆసక్తి చూపడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఇటీవల వార్డు పర్యటన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, సుబ్బారావు, అప్పన్న, వై.రాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


కిశోర్‌కుమార్ మృతదేహం


ప్రమాదంలో నుజ్జయిన స్కూటీ

ఆరిలోవ: జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ రాందాసు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలేనికి చెందిన తిప్పాడ కిశోర్‌కుమార్(32) సోఫా సెట్లు కుట్టే పనిచేస్తుంటాడు. అతడు అవివాహితుడు. ఏదో పనిమీద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరం నుంచి ఎండాడ వైపు స్కూటీపై బయలుదేరాడు. ఎండాడ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకొని కొంత దూరం వెళ్లిన తర్వాత డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో మధురవాడ వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి దూసుకుపోయింది. దీంతో కిశోర్‌కుమార్ తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. అతను నడిపిన స్కూటీ నుజ్జయింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాందాసు తెలిపారు. సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

12 రోజులుగా అంధకారం


కాకరలోవలో వెలగని విద్యుత్ దీపం

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలోని మీసేవ సెంటర్ వద్ద గత 12 రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి పడితే వీధుల్లో తిరగాలంటేనే భయంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తక్షణమే స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిని కుమారుడి వద్దకు చేర్చిన పోలీసులు


మర్రి బందోను కుమారుడికి అప్పగిస్తున్న పీసీ చంద్రశేఖర్

పెందుర్తి: ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయిన ఓ మహిళను పెందుర్తి పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాదాపు మూడు నెలల పాటు అనాథగా ఓ ఆశ్రమంలో ఆశ్రయం పొందిన ఆమె.. ఎట్టకేలకు పోలీసుల చొరవతో తన కుటుంబాన్ని చేరగలిగింది. వివరాలివి.. అల్లూరిసీతారామరాజు జిల్లా అరకు ప్రాంతానికి చెందిన మర్రి బందో(45) ఫిబ్రవరి 18న పని నిమిత్తం ఇంటి నుంచి నగరానికి వచ్చింది. ఆమెకు మానసిక సమస్య ఉండడంతో తిరిగి ఎలా వెళ్లాలో తెలియక, పెందుర్తి సమీపంలోని గొల్లవిల్లివానిపాలెం పరిసరాల్లో దిక్కుతోచని స్థితిలో తిరిగింది. ఈ క్రమంలో స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. అయితే ఆమె తన వివరాలు సరిగా చెప్పలేకపోవడంతో అనాథగా భావించి పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.

మూడు నెలల తరువాత..

అయితే పోలీసులు తమ ప్రయత్నం విరమించకుండా బందో స్వగ్రామం, కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. ఆమె ఫొటోను ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపారు. ఈ క్రమంలో ఆమెది అరకు ప్రాంతంగా గుర్తించి అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమె ఇంటిని కనుగొన్నారు. బందో కుమారుడు మర్రి కామేశ్వరరావును ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు రప్పించి ఆమెను అప్పగించడంతో ఆ తల్లి కథ సుఖాంతమైంది.

దేవీపురంలో ముగిసిన శ్రీవిద్య శిక్షణ


శిక్షణలో పాల్గొన్న దేశ విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహించిన శ్రీవిద్య మిడ్‌లెవెల్ కోర్సు ఆదివారంతో ముగిసింది. ప్రాథమిక స్థాయి శిక్షణ పూర్తి చేసుకుని, వచ్చిన దేశ, విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులను ఈ శిక్షణ అనంతరం గురుమాత అన్నపూర్ణమ్మ ఆశీర్వదించారు. కుల మత భేదాల్లేకుండా ఇటువంటి బ్రహ్మ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న ఆలోచనతో నేర్పిస్తున్న ఈ విద్య ఎక్కడికి వెళ్లినా, వారితో పాటు అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు కందర్ప రమ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. ఎర్నిమాంబ జాతర మహోత్సవం

ఘనంగా ముగిసిన అనుపోత్సవం


ప్రసాద వితరణ చేస్తున్న ఈవో సురేష్‌బాబా


ఎర్నిమాంబకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం–అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాన్ని ఆలయ ఈవో డీవీవీ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము 4 నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో భక్తులు బారులుతీరారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు, సుమారు 260 అమ్మవారి ప్రతిమలను తలపై పెట్టుకుని వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, ఆర్కెస్ట్రా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయ సిబ్బంది, ఆలయ చైర్మన్ లండా రమణ, కమిటీ ప్రతినిధులు, ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ఆలయం వద్ద భక్తుల సందడి

ఘనంగా తిరంగ యాత్ర


జాతీయ జెండాలతో ర్యాలీగా వెళుతున్న విప్ గణబాబు, మాజీ సైనికులు

గోపాలపట్నం: తిరంగ యాత్రను గోపాలపట్నంలో ఘనంగా నిర్వహించారు. సెలవులో ఉన్న సైనికులు, మాజీ సైనికులతో కలిసి గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌కు, ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పామన్నారు. సిందూర్ ఆపరేషన్ విజయవంతం చేసినందుకు భారత సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులర్పించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొని సెలవుపై వచ్చిన జవాన్లను, అలాగే మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ 8 కమిషనర్ హేమావతి, కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, బీజేపీ నాయకుడు బాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురంలో 'సంవిధాన్ బచావో అభియాన్' ర్యాలీ


ప్రకాష్‌నగర్ జాతీయజెండాలతో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల సెంటర్‌లో మల్కాపురం కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో 'సంవిధాన్ బచావో అభియాన్' పేరుతో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీగా తిరుగుతూ 'సంవిధాన్ బచావో అభియాన్' సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ కేవీ సూర్యనారాయణ, పీసీసీ జనరల్ సెక్రటరీ గాదం రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలంతో రాజ్యాంగంలోని మూలాలను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

61వ వార్డులో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

మల్కాపురం: 61వ వార్డు మల్కాపురం, ప్రకాష్‌నగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఆదివారం 'సంవిధాన్ బచావో అభియాన్' (రాజ్యాంగ పరిరక్షణ) కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ పార్టీ పశ్చిమ కన్వీనర్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ గాదం రమేష్, మహిళా నాయకురాలు ఎం. లక్ష్మి, యువజన నాయకులు శివ, మణికంఠ, ఎం.డి. రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసులు నమోదు


మేహాద్రి సమీపంలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను డ్రోన్ ద్వారా గుర్తించి, కేసులు రాస్తున్న పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో మేహాద్రిగెడ్డ, నాయుడుతోట, వేపగుంట ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ప్రమాదకరంగా ఈత కొడుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి, అక్కడి నుంచి పంపేశారు. ఈ క్రమంలో మద్యం సేవిస్తూ దొరికిన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.